www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 2 | సంచిక : 12 | 27-12-2021 | పుటలు : 4





నవ్వవత్సర శుభవేళ అభివాదాలతో..

నన్నయవాణి



## మంచి మాట

కత్తిచేసే గాయంకంటే
నాలుకచేసే గాయమే ప్రమాదకరమైంది.
- పైథాగరస్

# నైపుణ్యాభివృద్ధితోనే మంచి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు జాబ్ లెటర్స్ అందిస్తున్న వీసీ,ఎమ్మెల్యే

**16.12.21 (మీడియాసెల్)** నేటి పోటీ ప్రపంచంలో మంచి ఉద్యోగాలను సాధించాలంటే నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని,యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంపై దృష్టి సారించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గురువారం వికాస, నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్ ను వీసీ ప్రారంభించారు. ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఐ.టి.ఐ, డిప్లొమో, బి.టెక్ విద్యార్హతగల 1400 ఉద్యోగావకాశాలకు ఈ జాబ్ డ్రైవ్ జరిగింది. ఉభయగోదావరి జిల్లాల నుండి 1525 మంది అభ్యర్థులు మెగా జాబ్ డ్రైవ్ కు హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. టెక్ మహేంద్ర, టి.సి.ఎస్, బి.ఎస్.సి.పి.ఎల్, ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి, అమేజన్, అపోలో ఫార్మసి, జియో మార్ట్, ఇండిగో ఆయిర్ లైన్స్ వంటి ప్రముఖ కంపెనీల హెచ్.ఆర్. లు హాజరై అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసారు. తరువాత యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన సమావేశంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరై విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో వికాస సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రతీ స ఏటా సుమారు పదివేల మందికి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నారని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ మెగా జాబ్ డ్రైవ్ కు విశేష స్పందన వచ్చిందని 1525 మంది అభ్యర్థులు హాజరయ్యారని, సుమారు

## మెగా జాబ్ డ్రైవ్‌కు విశేష స్పందన

ఎనిమిది వందల మంది అభ్యర్థులు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి యూనివర్సిటీలో వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ డ్రైవ్ ను నిర్వహిస్తామని తెలియజేసారు. ఉద్యోగాలను సాధించిన వారు తమతమ వృత్తులలో మరింత నైపుణ్యాలను సంపాదించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలియజేసారు.ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఏ రంగంలోనైనా స్థిరపడాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ తప్పని సరిగా నేర్చుకోవాలని అన్నారు. ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్యాలను కలిగి ఉండాలని, ఉద్యోగాలకు అర్హత సాధించని వారు దీనిని అవకాశంగా తీసుకొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. వికాస వారు ఆయా కంపెనీల హెచ్.ఆర్.లతో మాట్లాడి శిక్షణ తరగతులు నిర్వహించి నియామకాలు చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పెద్దపెద్ద కార్యక్రమాలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదిక అవుతుందని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ ను అభినందించారు. వికాస చేస్తున్న సేవలు అభినందనీయమని భవిష్యత్ లో మరిన్ని ఉద్యోగాలను గోదావరి యువతకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహనరెడ్డి,వికాస ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.లచ్చారావు, మేనేజర్లు శ్రీకాంత్, శర్మ, సాయిబాబా, అధ్యాపకులు మరియు ఆయా కంపెనీల హెచ్.ఆర్.లు పాల్గొన్నారు.



# ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణపై జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు

**21.12.21 (మీడియాసెల్)** "కోవిడ్ 19 తర్వాత భారతీయ పరిశ్రమ మరియు ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి నిర్వహణ వ్యూహాలు" అనే అంశంపై నేషనల్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని డిపార్టమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ వెబినార్ బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. 2022 జనవరి 5,6 తేదీలలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నేషనల్ సెమినార్ ను నిర్వహిస్తున్నారని తెలిపారు. సెమినార్ డైరెక్టర్ గా ఆచార్య ఎస్.టేకి, కన్వీనర్స్ గా డా.పి.ఉమామహేశ్వరి, డా.ఎన్.ఉదయభాస్కర్ వ్యవహరిస్తున్నారని తెలియజేసారు. "కోవిడ్ 19 తర్వాత భారతీయ పరిశ్రమ మరియు ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి నిర్వహణ వ్యూహాలు" అనే అంశంతో పాటు సేవా రంగం/తయారీ రంగం, పర్యాటక పరిశ్రమ,వ్యవసాయ పరిశ్రమ , ప్రభుత్వ విధాన రూపకల్పన, విదేశీ వాణిజ్యం వంటి రంగాలపై నిర్వహణ పునరుద్ధరణ వ్యూహాలపై ప్రభావం వంటి అంశాలపై పరిశోధన పత్రాలను పంపించవచ్చునని తెలియజేసారు. మరిన్ని వివరాలకు www.nannayauniversityinfo.com, 0883 - 2472671, 2472615, 2472472 నెంబర్లను సంప్రతించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.ఉమామహేశ్వరి, డా.మోటూరి రమేష్ విభాగాధ్యాపకులు పాల్గొన్నారు.

## ఒకే కళాశాల నుండి... జయహో!



నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన మెగా జాబ్ డ్రైవ్ లో మలికిపురం ఎం.వి.ఎన్,జె.ఎస్ అండ్ ఆర్.వి.ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఆయా కంపెనీల ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒకే కాలేజీకి చెందిన విద్యార్థులకు, ఒకే రోజు వేరు వేరు కంపెనీలో ఉద్యోగాలు లభించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## సంపాదకీయం




# కొత్త క్యాలెండర్

ప్రతి చిన్న ఎలక్ట్రిక్ బల్బులోనూ ప్రకాశించే కాంతి వెనుక ఎంతో శక్తిమంతమైన విద్యుత్తు ఉందని, ప్రతి చిన్న అల వెనుక అనేకమైన పెద్ద అలలుగా ఉన్న మహా సముద్రముందని మనకు తెలుసు.అలాగే ప్రతి చిన్న పని వెనుక మహత్తరమైన సంకల్పముందని కూడా మనం గ్రహిస్తాం.'సింధువును చేరి బిందువు సింధువగును'అంటారు గాలిబ్ మహాకవి. అప్పటి వరకూ అది కేవలం నీటి బిందువు మాత్రమే దానిని తీసుకుని వెళ్ళి సముద్రంలో కలిపేస్తే అప్పటినుండి అది సముద్రమైపోతుంది. 'ధ్యేయమును బట్టి ప్రతి పని దివ్యమగును' ఇది ఆ కవితా పంక్తుల్లో రెండవ పాదం.గాలిబ్ చెప్పదలుచుకున్న అసలు విషయం ఇదే. మన సంకల్పాన్ని బట్టే మన ప్రతి చిన్న పని మహత్తరమైందిగా పరిణమిస్తుంది. చేయగలమని నిశ్చయించుకున్న పనిని మాత్రమే మనం చేయగలం. చేస్తాం కూడా.

మన మెదటిలోనే నమ్మశక్యంకాని మొత్తాల్లో అనంతమైన శక్తి ఏదో దాక్కొని ఉంది. అది ఎన్నో సమస్యలను పరిష్కరించగలదు. ఎన్నో కఠినమైన పనుల్ని పూర్తి చేయగలదు. సమస్యల నుంచి పారిపోవడం చాలా సులువైన పని. వాటితో కుస్తీ పట్టటంతోనే మనలో బలం పెరుగుతుంది. సమస్యలు లేని జీవితం జీవితమే కాదంటారు చాలామంది పెద్దలు. అది నిజమే. అనుభవ పూర్వకమైన మాట. మానసికంగా ఓడిపోనివాళ్లే నిజమైన విజేతలు కూడా.

కొన్నింటిని పూర్తి చేయాలని అనుకుంటాం. ఆ ఏడాదిలో అవన్నీ పూర్తి కాకపోవచ్చు. మరింత ఉత్సాహంతో కొత్త సంవత్సరంలో అడుగు పెట్టి వాటిని పూర్తి చేసి మరికొన్ని లక్ష్యాలను నిర్ణయించుకుంటాం. నిన్న, నేడు, రేపు... ఈ మూడు కాల స్వరూపానికి సోపానాలు. 'కలయతి ఇతి కాలమ్' అన్నింటినీ తనలో విలీనం చేసుకునేది అని నిర్వచనం. కాల ప్రవాహంలో కొట్టుకొనిపోయినవాళ్ళూ,కాలానికి ఎదురీదినవాళ్ళు, కాలాన్ని సద్వినియోగపరచుకున్న వాళ్ళు ఎందరో మనకు కనిపిస్తారు. మన ప్రమేయం లేకుండానే కాలం గడిచిపోతూ ఉంటుంది. క్షణక్షణ చైతన్యమే ఆశావహ జీవితాన్ని అందిస్తుంది. 'కాలో గచ్ఛతి ధీమతామ్' బుద్ధిమంతులు మంచి విషయాలతో కాలక్షేపం చేస్తుంటే మూరు?లు ఇతరులతో పోట్లాడటంతో, ఇతరులపై బురద చల్లడంతో కాలాన్ని వెళ్లబుచ్చుతారని శ్లోకనీతి, లోకరీతి!

నిన్నటిపై నేడు విజయం సాధించగలిగితే రేపటికి అది కార్య సఫలతను ఇస్తుంది. జరగవనుకున్న పనులను సాధించటానికి కాలంతో సమానంగా ప్రయాణించాలి.విఘ్నాలు కలుగుతున్నకొద్దీ ధీరులై నిలబడే ప్రయత్నమే మనం చేయాలి. ఎన్ని ఆటంకాలు ఎదురైనా రెట్టింపు ఉత్సాహంతో ప్రారంభించిన పనులను 'ప్రజ్ఞా నిధులు' పూర్తి చేస్తారంటారు భర్తృహరి. వారినే 'ధీరులు' అని కూడా సంబోధించారాయన. సజ్జన సాంగత్యమే ధీరత్వాన్ని కలిగిస్తుంది. అటువంటి సంకల్పాలతో,సాంగత్యాలతో ధీరులుగా మనగలగటమే ఒక ఏడాదిలోంచి మరొక యేడాదిలోకి వెళ్ళటం. ఎప్పటిలాగానే అలా మరో కొత్త క్యాలెండర్ లోకి, కొత్త విజయాల వైపునకు వెళ్దాం!!

## నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్



**21.12.21 (మీడియాసెల్)** ఈ రోజు మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి జన్మదినోత్సవ సందర్భంగా తాడేపల్లిగూడెంలో గల ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాంపస్ ఎన్. ఎస్. ఎస్. యూనిట్ అధికారి జె. కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీరమేష్ ,ఈ.సీ.మెంబెర్ డా.బి.జగన్మోహనరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులతో కలసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీరమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తును అందించడానికి అమ్మ ఒడి, విద్యా దీవెన లాంటి ఎన్నో పథకాలు ప్రారంభించి తల్లిదండ్రులమీద భారం పడకుండా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సి.ఎమ్. వై.ఎస్. జగన్మోహన రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఉన్నత విద్యాభివృద్ధికి సిఎం జగన్ కృషి



**14.12.21 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి విశేష కృషి చేస్తున్నారని, ఉన్నత విద్యపై సిఎం జగన్ కు చక్కని అవగాహన ఉందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వీసీ మొక్కలు నాటారు. ఎన్.ఎస్.ఎస్. మరియు విశ్వవిద్యాలయ అధ్యాపకేతర సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్ ను వీసీ కట్ చేసి సిఎం జగన్ కు పుట్టినరోజు శుభాకాక్షలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉన్నత విద్యపై సిఎం జగన్మోహనరెడ్డికి ఎంతో అవగాహన ఉందని అన్నారు. ఇటీవల ఉన్నత విద్యాధికారుల సమావేశంలో సిఎం జగన్ ప్రస్తావించిన విద్యాపరమైన కీలక అంశాలను తెలియజేసారు. ఎంతో నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటూ విద్యాభివృద్ధికి పాటుపడటం హర్షణీయమన్నారు. అమ్మఒడి, ఫీజురియింబర్స్మెంట్, జగనన్న విద్య దీవెన వంటివి ప్రజాదరణ పొందిన పథకాలని కొనియాడారు. దివంగతనేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సిఎం వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆధ్వ ర్యంలో ఎంతో అభివృద్ధి చెందు తుందన్నారు. సమాజహితం కోసం ఎన్నో శ్రమలను అధిగమించి వారు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా మనవంతు కృషి చేయాలని సూచిం చారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ప్రతి మండలంలో సుమారు వంద మంది విద్యార్థులతో సమాజ సేవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలలో సమస్యలను గుర్తించడం అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి వాటిని సామరస్యంగా పరిష్కరించడం వంటివి చేయాలన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో సాంకేతికత అభివృద్ధి చెందే విధంగా విద్యార్థులచే వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమాజసేవ కార్యక్రమాలను మొక్కుబడిగా కాకుండా నిబద్ధతతో చేయాలనే ఆలోచన ఉన్న విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు. అప్పుడే భావితరాలకు సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందని సమాజసేవతో ఆత్మసంతృప్తి ఉంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఎస్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియా రాణి, ప్రిన్సిపాల్స్ డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.వెంకటేశ్వర రావు, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.నూకరత్నం, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.ఉమామహేశ్వరి, డా.లత, సిఈ ఎస్.లింగారెడ్డి, జి.చంద్రకళ, హనుమంతు, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాంపస్ లో మొక్కలు నాటుతున్న వీసీ జగన్నాథరావు

# నన్నయ వీసీకి అభినందన

## ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

**14.12.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అభినందించారు. మంగళవారం వీసీ నివాసంలో జగన్నాథరావును ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మర్యాదపూర్వకంగా కలిసారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వీసీ జగన్నాథరావును అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపకులపతిగా జగన్నాథరావు బాధ్యతలు స్వీకరించినప్పటినుండి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. నన్నయ విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులను తీసుకురావడం నాక్ సాధన దిశగా నడిపించడం గొప్ప విషయాలన్నారు. కోవిడ్ వంటి సంక్షోభంలో కూడా విద్య, విజ్ఞాన వికాసాలకు వెబినార్లు నిర్వహించి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించారన్నారు. దానికి నిదర్శనంగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్, ఇండియ బుక్ ఆఫ్ రికార్డ్స్ లను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సొంతం చేసుకుందన్నారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో తనవంతు సహకారాన్ని అందిస్తానని ప్రభుత్వ సహకారం విశ్వవిద్యాలయానికి ఎప్పుడూ ఉంటుందని తెలియజేసారు.



వీసీ జగన్నాథరావును కలిసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు




## ప్రతిభా వాణి

# శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్

**(1887, డిసెంబర్ 22 - 1920 ఏప్రిల్ 26)**



బ్రిటీష్ పరిపాలన కాలంలో భారతదేశానికి చెందిన గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. పది సంవత్సరాల వయసులోనే గణితశాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. చిన్న వయసులోనే గణితం పట్ల ప్రకృతి సిద్ధమైన ప్రతిభ కనపరిచేవాడు. ఆ వయసులోనే ఎస్.ఎల్. లోని త్రికోణమితి మీద రాసిన పుస్తకాలను వంటపట్టించుకున్నాడు. పదమూడు సంవత్సరాలు నిండే సరికల్లా ఆ పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాకుండా తన సొంతంగా సిద్ధాంతాలు కూడా రూపొందించడం ప్రారంభించాడు.

1909, జులై 14వ తేదీన రామానుజన్ కు జానకీ అమ్మాళ్ అనే తొమ్మిదేళ్ళ బాలికతో వివాహమైంది.

అప్పట్లో కొత్తగా ఒక గణిత శాస్త్ర సమాజాన్ని ఏర్పరిచిన డిప్యూటీ కలెక్టర్ రామస్వామిని రామానుజన్ కలుసుకున్నాడు. ఆయన పని చేసే ఆఫీసులో ఒక చిన్న ఉద్యోగం కోరి ఆయనకు తాను గణితం మీద రాసుకున్న నోటు పుస్తకాలను చూపించాడు. వాటిని చూసిన అయ్యర్ తన రచనల్లో ఇలా గుర్తు చేసుకున్నాడు.

"ఆ నోటు పుస్తకాలలోని అపారమైన గణిత విజ్ఞానాన్ని చూసి నేను ఆశ్చర్యపోయాను. అంతటి గొప్ప విజ్ఞానికి ఈ చిన్న రెవెన్యూ విభాగంలో ఉద్యోగం ఇచ్చి అవమాన పరచలేను"

తరువాత రామస్వామి రామానుజన్‌కు కొన్ని పరిచయ లేఖలు ఇచ్చి మద్రాసులో తనకు తెలిసిన గణిత శాస్త్రవేత్తల దగ్గరకు పంపించాడు. అతని పుస్తకాలను చూసిన కొద్ది మంది అప్పట్లో నెల్లూరు జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్న రామచంద్రరావు దగ్గరకు పంపించారు. ఈయన భారతీయ గణిత శాస్త్ర సమాజానికి కార్యదర్శి కూడా. రామచంద్రరావు కూడా రామానుజన్ పనితనం చూసి అబ్బురపడ్డాడు. అసలు అవి అతని రచనలేనా అని సందేహం వచ్చింది. అప్పుడు రామానుజన్ తాను కలిసిన ఒక బొంబాయి ప్రొఫెసర్ సల్దానా గురించి, అతని రచనలు ఆ ప్రొఫెసర్‌కు అర్థం కాలేదని చెప్పాడు.

నారాయణ అయ్యర్, రామచంద్రరావు, మిడిల్‌మాస్ట్ మొదలైన వారు రామానుజన్ పరిశోధనలను ఆంగ్ల గణిత శాస్త్రవేత్తలకు చూపించడానికి ప్రయత్నించారు. లండన్ యూనివర్సిటీ కాలేజీకి చెందిన ఎం.జే.ఎం.హిల్ అనే గణితజ్ఞుడు రామానుజన్ పరిశోధనల్లో కొన్ని లోపాలున్నాయని వ్యాఖ్యానించాడు. హిల్ రామానుజన్ ను విద్యార్థిగా స్వీకరించేందుకు అంగీకరించలేదు గానీ, రామానుజన్ పరిశోధనలపై మంచి సలహాలు మాత్రం ఇచ్చారు.

రామానుజన్ చాలా సున్నితమైన భావాలతో, మంచి పద్ధతులు కలిగి, బిడియస్తుడిగా ఉండేవాడు. ఆయన కేంబ్రిడ్జిలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని గడిపాడు. ఆయన జీవిత చరిత్రను రాసిన మొట్టమొదటి రచయిత ఆయన్ను శుద్ధ సాంప్రదాయవాదిగా పేర్కొనడం జరిగింది. తనకు సంక్రమించిన సామర్థ్యం అంతా తమ ఇలవేల్పు దేవత అయిన నామగిరి ప్రసాదించినదేనని రామానుజన్ బలంగా విశ్వసించేవాడు. తనకు ఏ కష్టం కలిగినా ఆమె సహాయం కోసం ఎదురు చూసేవాడు. ఆమె కలలో కన్పించి ఎటువంటి సమస్యకైనా పరిష్కారం చూపించగలదని భావించేవాడు. భగవంతునిచే ప్రాతినిధ్యం వహించబడని ఏ ఆలోచన కూడా సూత్రం కానేరదు అని అప్పుడప్పుడూ? అంటుండేవాడు.

రామానుజన్ అన్ని మతాలు ఒకటిగా నమ్మేవాడని హార్డీ ఒకసారి పేర్కొన్నాడు. ఆయన ఆధ్యాత్మికతను భారతీయ రచయితలు అతిగా అర్థం చేసుకున్నారని వివరించాడు. అంతే కాదు, రామానుజన్ యొక్క శుద్ధ శాకాహారపు అలవాట్ల గురించి కూడా ప్రస్తావించాడు.

రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2012 ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది.

# శ్రీనివాస రామానుజన్ ఆదర్శమూర్తి




రామానుజన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్

**22.12.21 (మీడియాసెల్)** నిత్య జీవితంలో గణితశాస్త్రానికి ఎక్కువ ప్రాధాన్యం ఉందని, గణితశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో గణితశాస్త్రానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, గణితశాస్త్రంపై ప్రతీ ఒక్కరూ పట్టు సాధించాలని అన్నారు. మానవతా దృక్పథంతో నిత్య జీవితంలో ఎంతమందికి సహాయం చేస్తున్నామనే విషయాలను వ్యక్తిగతంగా లెక్కలు వేసుకోవాలన్నారు. 32 సవంత్సరాలు జీవించిన శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్రంలో భారతదేశానికి ఎనలేని ఖ్యాతిని తీసుకువచ్చారని తెలిపారు. మనం అనుకున్న లక్ష్యాలను సాధించడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా మన లెక్క తప్పకూడదని చెప్పారు. గణితశాస్త్ర విద్యార్థులు, అధ్యాపకులు శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలియజేసారు. జాతీయ గణితశాస్త్ర దినోత్సవం సందర్భంగా గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలోని విజేతలకు బహుమతులను అందజేసారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, కె.రేవతి, కె.గీతాలక్ష్మీ, డా.వి.మల్లిప్రియ, వరకుమార్, జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో రాష్ట్ర హెచ్.ఎం.ల సంఘ మహాసభ

**16.12.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 29 న రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర మహాసభ జరగనుంది. 'జాతీయ విద్యా విధానంలో ప్రధానోపాధ్యా యుల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కోలా సత్యనారాయణ గురువారం విలేకరులకు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ ను 'నన్నయ ' వర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేతుల మీదుగా విడుదల చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ , సంఘం రాజమహేంద్రవరం హెచ్.ఎం.ల డివిజన్ అధ్యక్ష , కార్యదర్శులు కేవీ రమణరావు , జీ.వి. గణపతిరావు తదితరులు పాల్గొన్నారు .




# నన్నయ యూనివర్సిటీ కాకినాడ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ ప్రోగ్రామ్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ నందు ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎం. కమల కుమారి మాట్లాడుతూ "ఎన్నో మంచి విద్యాభివృద్ధి పథకాల ద్వారా విద్యార్థుల ఉన్నతికి అలాగే వారిని చదివిస్తున్న తల్లిదండ్రులపై భారం పడకుండా అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం చాలా ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ అధికారులు ఎల్. మధు కుమార్, వి శ్రీనివాసరావు మరియు బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.


అక్షరరూపం
దాల్చిన
సిరాచుక్క
లక్ష మెదళ్లకు
కదలిక.

\- కాళోజి నారాయణరావు



చిత్రం: ముమ్మిడి చిన్నారి

## ఓ రైతన్నా ....!




నీవు మాకు అన్నం పెడుతూ చేస్తున్నావు వ్యవసాయం!
అన్నదాతవైన నీకు రావడం లేదు సరైన ఆదాయం!
కష్టాల్లో నీకు ఎవ్వరూ చేయరు సాయం!
వరద,కరువులు ఏది వచ్చినా నీకు కలిగేది అపాయం!
దళారులు వల్ల నీకు జరిగేది అన్యాయం!
నీకు కష్టం వస్తే ఆదుకుంటామని ఎవరూ ఇవ్వరు అభయం!
రాత్రి, పగలు తేడా లేకుండా పొలాల్లో నీవు ప్రతి సమయం...
కష్టపడి పంటలు పండిస్తున్నా నీకు దక్కడం లేదు ఏ విజయం!
అయినా నీవు మన దేశానికి నిరంతరం చేస్తున్నావు సాయం!
ఎంత గొప్పదయ్యా ప్రతి కష్టాన్ని తట్టుకునే నీ హృదయం!!

**రాజేష్ మోసిగంటి బి.టెక్ (సివిల్) నన్నయ యూనివర్సిటీ**

# ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం

## 2021 రౌండప్




## 2022కి స్వాగతం..

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in